

లాభాలు తెస్తున్న లాజిస్టిక్స్

నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి కార్గో సర్వీస్ బూస్ట్ నిచ్చింది. సంస్థకు మంచి ఆదాయ వనరుగా మారింది. లాజిస్టిక్స్ సేవలు మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కథనం.. 4లో▸

డీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్‌: డైట్ కళాశాలల్లో ప్రవేశానికి డీసెట్ పరీక్షలో అర్హత సాధించిన 1,350 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో చేపట్టారు. మొదటిరోజు 450 మందికి గాను 350 మంది సర్టిఫికెట్లు పరిశీలించుకున్నారు. ప్రక్రియను ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్, నిర్మల్ డీఈవో డాక్టర్ రవీందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, సూపరింటెండెంట్ భోజన్న పరిశీలించారు. అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించారు.

గరిష్టం/కనిష్టం
38.0/29.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అభివృద్ధిలో బీఆర్‌ఎస్ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

బోథ్‌: బోథ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక సీపీఐ భవన్‌లో బుధవారం పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. బోథ్‌లో ఫైర్ స్టేషన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని, పీఎఫ్ కలిగిన ప్రతీ బీడీ కార్మికురాలికి పెన్షన్ అందించాలని తీర్మానించారు. బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు సహకరిస్తూ పేదలను విస్మరిస్తోందని ఆరోపించారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు గోదావరి, గోవర్ధన్, ఎస్.దాస్, షాకీర్, ఖాజీమొద్దీన్, భోజన్న, సుమేర్ పాషా, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

‘వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే’



గ్రామంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్‌: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి చిల్కూరి రామచంద్రారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, ఏఎంసీ మాజీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలం మాలేబోరిగామ గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులు, నిరుద్యోగులు, ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో ఆదరణ లభిస్తోందని చెప్పారు. పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి ఆనంద్‌రావ్, నాయకులు అంబకంటి అశోక్, సంజయ్ దుబే పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

బోథ్‌: మండల కేంద్రంలోని మాల సంక్షేమ సంఘం భవనం వద్ద రూ.2 లక్షలతో చేపట్టిన బోరుబావి పనులకు ఎంపీ సోయం బాపూరావ్ బుధవారం భూమిపూజ చేశారు. కొటా గ్రామంలో రూ.3.50లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పుచ్చల గ్రామంలో రామమందిరం వద్ద రూ.3లక్షలతో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన రక్తదాత శ్రీకాంత్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గొల్ల రాజుయాదవ్, జీవీ రమణ, అశోక్‌రెడ్డి, తూము సూర్యం, వెండి సోమేశ్వర్ తదితరులున్నారు.

చీటింగ్..!

- బియ్యం వ్యాపారి ఘరానా మోసం
- రూ.3కోట్ల చీటి డబ్బులతో పరారీ
- వ్యాపారంలో నష్టమంటూ వంచన
- లబోదిబోమంటున్న బాధితులు
- బాధితుల్లో బడావ్యాపారులూ..!



ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లాలో చీటి దందా జోరుగా సాగుతోంది. కొందరు అధికారికంగా, మరికొందరు అనధికారికంగా చిట్‌ఫండ్ సంస్థలు నిర్వహిస్తున్నారు. మరికొందరు ఏజెంట్లుగానే చీటీలు నిర్వహిస్తున్నారు. మొదట్లో చీటి డబ్బులు సరిగా ఇస్తూ నమ్మకం కలిగిస్తున్నారు. ఆ తర్వాత నష్టం వచ్చిందంటూ పెద్దమొత్తంతో పరారీ అవుతున్నారు. దీంతో కస్టమర్లు లబోదిబోమంటున్నారు. ఆదిలాబాద్ పట్టణంలో కొన్ని కోఆపరేటివ్ సొసైటీలు కూడా ఇలాంటి దందాకు తెరలేపుతున్నాయి. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోగల ఓ కోఆపరేటివ్ సొసైటీ కూడా బాధితుల నుంచి రూ.లక్షలు వసూలు చేసింది. వారికి తిరిగి డబ్బులు ఇవ్వకుండా నిర్వాహకులు కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిప్పుకుంటున్నారు. అధిక వడ్డీ ఇస్తామని చెప్పి బోర్డు తిప్పేస్తున్నారు.

తాజాగా మరో మోసం..

జిల్లా కేంద్రంలోని నటరాజ్ థియేటర్ సమీప గంజ్ రోడ్ ప్రాంతంలో ఓ బియ్యం వ్యాపారి పట్టణంలో పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి చీటీలు నిర్వహించాడు. నెలకు రూ.5లక్షల చీటీలు నిర్వహించాడు. గ్రూప్‌లో 50 మంది వరకు చేర్చుకున్నాడు. ఒక్కొక్కరి వద్ద నెలకు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేశాడు. వడ్డీ ఇస్తానని చెబుతూ చీటీలో లక్కీ లేసిన వారి నుంచి కూడా డబ్బులు అప్పుగా తీసుకుంటాడు. అప్పు తీసుకున్న వారికి రూ.3 చొప్పున వడ్డీ చెల్లిస్తూ కొద్దిరోజులు నమ్మించాడు. బంధువులు, స్నేహితులు, బడా వ్యాపారులతో సంబంధాలుండడంతో చీటి డబ్బులు కట్టించుకుని నమ్మకంగా చెల్లిస్తూ వచ్చాడు. గత ఐదారు నెలలుగా వసూలు చేసిన చీటి డబ్బులు గడువు తీరినవారికి చెల్లించకుండా జాప్యం చేస్తూ వచ్చాడు. ఇలా రూ.3 కోట్ల వరకు డబ్బులు జమ చేశాడు. ఇటీవల కొడుకుతో కలిసి రూ.3కోట్లతో ఉడాయించాడు. దీంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. బాధితుల వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో రికవరీ అవుతాయో.. లేదోనని దిగులు చెందుతున్నారు. కొంతమంది నగదు రూపంలో ఇవ్వగా, మరికొంత మంది ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిపినట్లు చెబుతున్నారు. అయితే తన బియ్యం వ్యాపారంలో నష్టం వచ్చిందంటూ బియ్యం వ్యాపారి చెబుతున్నప్పటికీ ఆయన నడిపేది చిన్న షాపేనని బాధితులు పేర్కొంటున్నారు. బాధితుల్లో బడా వ్యాపారులు కూడా ఉన్నారు. బయటకు చెబితే పరువు పోతుందని మిన్నకుంటున్నారు. తనను ఇబ్బందులకు గురిచేస్తే ఆత్మహత్య చేసుకుంటానని, కోర్టు నుంచి ఐపీ తెచ్చుకుంటానని సదరు వ్యాపారి చెబుతున్నట్లు కొంతమంది బాధితులు పేర్కొంటున్నారు. అయితే ఈ విషయంలో బాధితులెవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.

ముంచుతున్న ఏజెంట్లు

జిల్లాలో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అనధికారికంగా పలువురు తమకుతాము ఏజెంట్లుగా ప్రకటించుకుని చీటి దందా నిర్వహిస్తున్నారు. నెలకు రూ.5వేల చీటికి రూ.50వేలు.. రూ.లక్ష, రూ.10వేలతో రూ.2లక్షలు.. రూ.5లక్షల చీటీలు నిర్వహిస్తూ ఇలా నెలనెలా డబ్బులు వసూలు చేస్తున్నారు. 12 నెలలు నడుపుతూ అందులోంచి రెండు వాయిదాల డబ్బులు కమీషన్ కింద తీసుకుంటున్నారు. ఒక్కో చీటిలో రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు దండుకుంటున్నారు. ఈమధ్య కొత్తగా మూడు నెలలకోసారి చెల్లించేలా చీటీలు రూపొందించి వసూళ్లకు పాల్పడుతున్నారు. మహిళలు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులే వీటిని నిర్వహిస్తుండడం గమనార్హం. చీటి డబ్బులు తీసుకున్న వారికి ఎలాంటి రశీదు ఇవ్వకపోవడంతో బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అనుమతి లేకుంటే చర్యలు



అనుమతులు లేకుండా చీటీలు నిర్వహించరాదు. మొదట్లో నమ్మించి సరిగ్గా డబ్బులు చెల్లించినా కొన్నిరోజుల తర్వాత పరారీ అవుతారు. ప్రజలు ఎవరూ అనధికారిక వ్యక్తుల వద్ద చీటీలు వేయకూడదు. చీటి నడిపే వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. బియ్యం వ్యాపారికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. బాధితులు ఆశ్రయిస్తే న్యాయం జరిగేలా చూస్తాం.

– డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ, ఆదిలాబాద్

వీరులారా వందనం !



ఈమె పేరు లక్ష్మి. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామం. ఆమె కొడుకు నాయకిని నగేశ్ 23ఏళ్ల వయస్సులో తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేశాడు. ఓయూ క్యాంపస్‌లో పీజీ చేసిన అతడు 2011లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జాప్యాన్ని నిరసిస్తూ ఓ లేఖ రాసి మంచిర్యాల రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం చివరలో రైలుకు ఎదురెళ్లి చనిపోయాడు. ఆ సమయంలో ఓయూ క్యాంపస్‌తోపాటు పెద్ద ఎత్తున ఉద్యమం ఎగిసింది. మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య, తదితరులు వచ్చి నివాళులర్పించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రూ.లక్ష సాయం చేశారు. అంతకుమించి ఎలాంటి సాయం అందలేదని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటోంది.

- రాష్ట్ర సాధనకు అనేకమంది ఆత్మబలిదానం
- కొందరికే అందిన ప్రభుత్వ సాయం
- ఉమ్మడి జిల్లాలో 27మందికి రూ.పది లక్షల సాయం
- ఇంకా అనేక కుటుంబాలకు ఎదురుచూపులే..
- నేడు అమరుల సంస్మరణ దినోత్సవం



మంచిర్యాల పట్టణం రాళ్ల వాగు సమీపంలో నిర్మించిన అమరవీరుల స్తూపం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎంతోమంది ఆత్మబలిదానాలతో నేటి స్వరాష్ట్రం ఏర్పడింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయి పదో ఏడాదిలోకి అడుగు పెడుతున్న వేళ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా నేడు గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నారు. అమరుల్లో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎంతోమంది తెలంగాణ ఏర్పాటును కాంక్షిస్తూ ఆత్మబలిదానం చేశారు. వీరిలో కొందరికి మాత్రమే ప్రభుత్వం నుంచి సాయం అందింది. మరికొందరికి స్థానిక నాయకులు, రాజకీయ పార్టీల నుంచి సాయం అందింది. ఇప్పటికీ తమ కుటుంబాలకు న్యాయం జరగలేదని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకున్న వారిలో 27మందికి రూ.పది లక్షల చొప్పున ఆర్థిక సాయం అందింది. ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు. కొందరికి ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికీ కొంతమంది అమరుల కుటుంబాలకు ఎలాంటి సాయం అందలేదు. బెల్లంపల్లిలో తెలంగాణ ఉద్యమంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో పిన్న రాజ్‌కుమార్ అనే వ్యక్తి భార్య పద్మకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించారు. ప్రస్తుతం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తోంది. ప్రభుత్వ పరంగా రూ.10 లక్షల ఆర్థిక సాయం కూడా అందజేశారు.

- 2012లో ఆదిలాబాద్‌కు చెందిన సంతోష్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ చదువుతుండేవాడు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఓయూ క్యాంపస్‌లో ఆర్ట్స్ కాలేజీ ముందే ఓ చెట్టుకు ఉరేసుకుని ప్రాణత్యాగం చేశాడు. ఆత్మహత్యతో ఓయూ అట్టుడికింది. అమరుని కుటుంబానికి రూ.పది లక్షల సాయం అందింది.
- 2013లో ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడకు చెందిన పుంద్రువార్ నర్సింగ్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో ఎమ్మెల్యే జోగు రామన్న నేతృత్వంలో రాస్తారోకో చేశారు. ఈయన కుటుంబంలో ఒకరి ఉద్యోగం, రూ.పది లక్షల సాయం అందింది.

అమరుల కుటుంబాలకు అందని సాయం

- బెల్లంపల్లికి చెందిన శ్రీనివాస్, రాజు అనే ఇద్దరు యువకులు కూడా స్వరాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసుకున్నారు. కానీ.. వీరి ఆత్మహత్య కేసు పోలీసు రికార్డుల్లో నమోదు కాలేదు. అందువల్ల ఇరువురు బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందలేదు. ఉద్యోగ అవకాశం కల్పించలేదు.
- చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామానికి చెందిన ముత్యాల రాజగౌడ్, సుబ్బారాంపల్లి గ్రామానికి చెందిన బిల్కి మహేశ్ ప్రాణత్యాగం చేశారు.

అమరవీరుల ఆకాంక్షలు నెరవేరలే..



తెలంగాణ వస్తే బతుకులు బాగుపడుతాయని అనేక మంది ఆత్మబలిదానాలు చేసుకుంటే ఇప్పటికీ వారి ఆకాంక్షలు నెరవేరలే. కుటుంబ, గడీల పాలనలో సామాజిక న్యాయం జరగలేదు. ప్రజలు కోరుకున్న తెలంగాణ రాలేదు. నేటికీ రైతులు, నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

– దుర్గం భాస్కర్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

అక్రమార్కుడిపై డీఎంఈ సీరియస్

- విచారణకు రిమ్స్ డైరెక్టర్‌కు ఆదేశాలు
- ముగ్గురు ప్రొఫెసర్లతో విచారణ కమిటీ

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో అక్రమార్కుడి దందాపై డీఎంఈ సీరియస్ అయ్యారు. బుధవారం ‘సాక్షి’ దినపత్రికలో ‘ఆశ చూపి కాజేస్తూ.. ఉద్యోగాల పేరిట మోసం.. అవుట్ సోర్సింగ్ జాబ్ కోసం రూ.1.50లక్షలు వసూలు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీఎంఈ రమేశ్‌రెడ్డి అక్రమార్కుడిపై విచారణ జరిపించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో డైరెక్టర్ ముగ్గురు ప్రొఫెసర్లతో కూడిన కమిటీ వేశారు. ప్యాథాలజీ విభాగంలో విచారణ చేపట్టనున్నారు. విచారణ కమిటీ సభ్యుల నివేదిక అనంతరం బాధ్యుడిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఉద్యోగం నుంచి తప్పించాలని సూచించినట్లు సమాచారం. కాగా, బాధితుడు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపాడు. తనకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు.



‘సాక్షి’లో ప్రచురితమైన కథనం

కేంద్రం నిధులతోనే మౌలిక వసతులు

- ఎంపీ సోయం బాపూరావ్
- అభివృద్ధి పనులకు భూమిపూజ



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావ్

బజార్‌హత్నూర్‌: రాష్ట్రంలో ప్రతీ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ తెలిపారు. బుధవారం మండలంలోని బోస్రా గ్రామంలో రూ.8లక్షల ఎంపీ నిధులతో చేపటిన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. గిర్నూర్ గ్రామంలో రూ.3 లక్షలతో సబరి మాత ఆశ్రమ అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ.5 లక్షలతో చేపట్టిన యాదవ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ రోడ్లు, వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లెప్రకృతి వనాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేపట్టగా, రాష్ట్ర ప్రభుత్వం తానే చేసినట్లు చెప్పుకుంటోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, గ్రామాలాభివృద్ధి వేగవంతంగా చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజుయాదవ్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణ, మండలాధ్యక్షుడు బత్తిని సుధాకర్‌యాదవ్, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, కేవల్‌సింగ్, ఎంపీటీసీ సోన్‌టాకే గజానంద్, నందీశ్వర్, రాజు, కిషన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రస్థానం

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం



సుదర్శన యాగంలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌: అభివృద్ధిలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో ఉందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని మార్వాడి పంచాయతీ భవన్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, ఖుర్షాపూర్ మసీదులలో నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవంలో ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో కలెక్టర్, ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారితో ప్రత్యేక పూజలు చేయించారు. వేద పారాయణం, సుదర్శన యాగ క్రతువులో కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో విలసిల్లాలని దేవుళ్లను కోరుకున్నట్లు తెలిపారు. జిల్లా ప్రగతికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. జిల్లాలో రూ.13 కోట్లతో ఆలయాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. దేవాదాయశాఖ ద్వారా వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్న అర్చకులకు ధూప దీప నైవేద్య పథకం కింద గౌరవ వేతనం అందజేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో 1,800 మంది మాత్రమే అర్చకులకు గౌరవ వేతనాలు అందేవని ప్రస్తుతం 6,000 వరకు గౌరవ వేతనాలు అందజేస్తున్నామన్నారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తానని, అందుకు అందరి సహకారం అవసరమన్నారు. అనంతరం దీప ధూప నైవేద్యం కింద అర్చకులకు సంబంధిత ధ్రువపత్రాలు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. అంతకుముందు కైలాసనగర్ కాలనీలోగల బౌద్ధ విహార్‌లో నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి పాల్గొన్నారు.

ప్రజలంతా ఐక్యతతో జీవించాలి

తాంసి: సర్వమతాలు ఒక్కటేనని, ప్రజలంతా ఐక్యతతో జీవించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ కోరారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రానికి సమీపంలోగల బుద్ధవిహార్ వద్ద ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరు కాగా ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. ధ్యాన మందిరంలో ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్ ధ్యానం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. బుద్ధుడి విగ్రహం వద్ద షాక్ బౌద్ధ దమ్మాతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బుద్ధవిహార్‌లో బహుమతులు పంపిణీ చేశారు. బుద్ధవిహార్ వ్యవస్థాపకుడు షాక్ బౌద్ధ దమ్మాకు యంత్రాంగం తరపున నిత్యావసరాలకు ఉపయోగపడే వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమాల్లో తాంసి, తలమడుగు జెడ్పీటీసీలు తాటిపెల్లి రాజు, గోక గణేశ్‌రెడ్డి, తలమడుగు ఎంపీపీ రాజేశ్వర్, సుంకిడి సర్పంచ్ మహేందర్, అంబేద్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దుర్గం శేఖర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఎంపీడీవో భూమయ్య, తహసీల్దార్ శ్రీదేవి, అధికారులు నారాయణ్‌రెడ్డి, సురేందర్, బుద్ధవిహార్ కమిటీ సభ్యులు లక్ష్మీకాంత్, బాబు సోనులే తదితరులున్నారు.



బుద్ధవిహార్‌లో ధ్యానం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

‘వైఎస్సార్ పాలన కోరుకుంటున్న ప్రజలు’



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న అనిల్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్‌: ప్రజలు మరోసారి వైఎస్సార్ పాలన కోరుకుంటున్నారని వైఎస్సార్ టీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నుంచి బుధవారం వైఎస్సార్‌టీపీలో చేరిన కొంపెల్లి గోపికి ఆయన పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అతడిని పట్టణంలోని నాలుగో వార్డు అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ పట్టణంలోని 49 వార్డుల్లో కమిటీలు పూర్తి చేసి బూత్ స్థాయి కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను ప్రజలకు గుర్తు చేస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. వైఎస్సార్ టీపీ అధినేత్రి షర్మిల ఆదేశాల మేరకు పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. రానున్నకాలంలో వైఎస్సార్ పాలన కోసం తమ పార్టీ పోటీ చేస్తుందని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పెందుర్ మనోహర్, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెస్రం శంకర్, పట్టణాధ్యక్షుడు షేక్ అస్లం, కృష్ణంరాజు, ఈశ్వర్‌దాస్ పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం



జిల్లా కోర్టు ఆవరణలో ఆసనాలు వేస్తున్న జడ్జి, సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్‌: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా జడ్జి వీఆర్‌ఆర్ వరప్రసాద్, ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ పీ భరద్వాజ ఆసనాలు వేసి యోగా ప్రయోజనాల గురించి వివరించారు. సఖీ కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని కేఆర్‌కే కాలనీ, మహాలక్ష్మీవాడ, టీచర్స్ కాలనీల్లో బ్యూటీషియన్ శిక్షణ పొందుతున్న మహిళలకు సఖీ సేవల గురించి తెలిపారు. సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం-1, ఖుర్షాపూర్ అంగన్‌వాడీ కేంద్రం-7 లోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. రిమ్స్ ఆస్పత్రిలో మెడికోలు కళాశాల ఆవరణలో ఆసనాలు వేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో యోగా గురువు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆసనాలు వేశారు. యోగా సాధనతో కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమాల్లో పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్లు రాజ్‌కుమార్, సురేశ్, రామేశ్వర్‌రెడ్డి, సుధాకర్, నీల్‌కమల్, మురళీకృష్ణ, కుమారస్వామి, రవికుమార్, సుధాకర్, రాజేశ్, కిశోర్, ఎజాజ్, శ్రీనివాస్, జ్యోత్స్నారాణి, హేమలత, సఖీ కేంద్రం కౌన్సిలర్లు లావణ్య, సంఘమిత్ర, రిమ్స్ వైద్యులు చంద్రశేఖర్, వాణి, నీలోఫర్, నరేందర్, టీపీయూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్‌చౌహాన్, వల్లభోజు గోపాలకృష్ణ, అనిల్, నరేశ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లాభాలు తెస్తున్న 'లాజిస్టిక్స్'

2020 జూన్ 19 నుంచి 2023 జూన్ 19 వరకు డిపోలవారీగా ఆదాయం

డిపో	పార్సిల్స్	సమకూరిన ఆదాయం
మంచిర్యాల	2,48,719	రూ.2,78,30,941
ఆదిలాబాద్	1,34,003	రూ.1,50,17,333
నిర్మల్	1,31,155	రూ.1,34,94,133
ఆసిఫాబాద్	85,905	రూ.1,05,47,853
భైంసా	39,492	రూ.51,96,256
ఉట్నూర్	11,112	రూ.9,65,805
మొత్తం	6,50,386	రూ.7,30,52,321

- ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణ
- వేగంగా పార్సిల్స్ చేరవేత
- సేవలు ప్రారంభించి మూడేళ్లు



ఆదిలాబాద్‌లోని ఆర్టీసీ లాజిస్టిక్స్ బుకింగ్ కార్యాలయం

ఆదిలాబాద్: నష్టాల ఒడిదుడుకుల మధ్య ముందుకు సాగుతున్న ఆర్టీసీకి కార్గో సర్వీస్ బూస్ట్ నిచ్చింది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న ప్రజా రవాణా సంస్థ పలు కారణాల చేత నష్టాల ఊబిలో కూరుకుపోయింది. ఆర్టీసీని నష్టాలనుంచి గట్టెక్కించి లాభాలబాట పట్టేలా సంస్థ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం మంచి ఆదాయం వనరుగా మారింది. 2020 జూన్ 19న ప్రారంభమైన ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలు మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కథనం.

ఉపాధినందిస్తూ.. విస్తృతం చేస్తూ

కార్గో సేవలను అన్ని మండలాలకు విస్తరించడంలో భాగంగా సర్వీస్ ఏజెంట్లను నియమించారు. మండల కేంద్రాల్లో కమీషన్ ప్రాతిపదికన ప్రైవేట్ ఏజెంట్లను నియమించారు. లాజిస్టిక్స్ కమీషన్ ఏజెంట్లకు పార్సిల్ బుకింగ్స్ మీద 12 శాతం, పార్సిల్ రిసీవింగ్ మీద ఒక్కోదానిపై పది రూపాయల కమీషన్ చెల్లిస్తున్నారు. దీంతో సేవలు క్షేత్రస్థాయిలో అందుతుండడంతో పాటు పలువురు నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోంది. కమీషన్ ఏజెంట్లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పార్శిళ్లను వినియోగదారులకు అందజేయడం, తమ ప్రాంతాల నుంచి పార్శిళ్లను బుక్ చేయడం ద్వారా రెండు రకాలుగా ఆదాయం పొందుతున్నారు. రీజియన్ పరిధిలో 30 లాజిస్టిక్స్ ఏజెన్సీలు ఉండగా, 4 ఆర్టీసీ బుకింగ్ కార్యాలయాలు ఉన్నాయి.

రూ.7.30 కోట్ల ఆదాయం

లాజిస్టిక్స్ ద్వారా అందిస్తున్న సేవలతో ఆదాయం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. సగటున రోజుకు ఎనిమిది వందల వరకు బుకింగ్స్ జరుగుతుండగా, లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తోంది. అత్యధికంగా మంచిర్యాల డిపో పరిధిలో 2.48 లక్షల పార్శిళ్లు బుక్ చేయగా రూ.2.78 లక్షల ఆదాయం వచ్చింది. రీజియన్ వ్యాప్తంగా ఇప్పటివరకు 6,50,386 పార్శిళ్లు బుక్ చేయగా రూ.7.30 కోట్ల ఆదాయం సమకూరింది.

- పార్శిళ్లు, కవర్లు, సరుకు రవాణా చేయడమే కాకుండా ప్రజలను ఆకట్టుకునేలా వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టడం, రాయితీలు ప్రకటించడం, ప్రత్యేక సందర్భాల్లో పలు ఆఫర్లు ఇవ్వడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలను అందించడం ద్వారా రాఖీ సమయంలో పెద్ద ఎత్తున ఆదాయం వచ్చింది.
- **మేడారం మొక్కులు :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర నేపథ్యంలో జాతర వరకూ ప్రయాణించలేని భక్తులు మొక్కులు చెల్లించడానికి ఆర్టీసీ కార్గో సేవల ద్వారా అవకాశం కల్పించారు. అమ్మవార్లకు బంగారం (బెల్లం) సమర్పించడానికి కార్గో కౌంటర్ల ద్వారా బుకింగ్ సౌకర్యం కల్పించారు.

కాలానుగుణం.. నిత్య నూతనం

- **రాములోరి తలంబ్రాలు:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించలేని, భద్రాచలానికి వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం రాములోరి తలంబ్రాలను భక్తులకు అందజేశారు. రూ.116 చెల్లిస్తే తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చారు.
- **ధాన్య సేకరణ:** రైతుల పంట ఉత్పత్తులను కల్లాల నుంచి నేరుగా మార్కెట్‌కు కార్గో ద్వారా అతి తక్కువ ఖర్చుతో రవాణా చేసుకునే అవకాశం కల్పించారు. దీని ద్వారా రైతులకు రవాణా సులభం అవ్వడమే కాకుండా నేరుగా మార్కెట్‌కు తరలించడం వలన గిట్టుబాటు ధర లభ్యమైంది.
- **హోండెలివరీ సేవలు:** మొదట్లో పార్శిల్, కొరియర్ బుక్ చేయాలంటే బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా బుకింగ్ చేయాల్సి ఉండేది. అంతేకాకుండా బస్టాండ్‌కు వచ్చి సంబంధిత కవర్లను తీసుకోవాల్సి వచ్చేది. అయితే ప్రజలకు సేవలను మరింతగా చేరువ చేసేందుకు హోమ్ డెలివరీ సేవలను సైతం కార్గో ప్రారంభించింది. ఎంపిక చేసిన పట్టణ ప్రాంతాల్లో దీని ద్వారా వస్తువులను ఇంటివద్దకు వెళ్లి పికప్ చేసుకోవడం, డెలివరీ చేయడం లాంటి సేవలు అందిస్తున్నారు.
- **బంగినపల్లి మామిడి:** వేసవి కాలంలో ఎంతో రుచికరమైన బంగినపల్లి మామిడి పళ్లను బుక్ చేసుకున్నవారికి చేరవేశారు.

క్విక్ అండ్ సేఫ్..

ఆర్టీసీ కార్గో, పార్శిల్ సర్వీస్ ద్వారా చాలా వేగంగా సేవలు అందుతుండడంతో వినియోగదారులు లాజిస్టిక్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రైవేట్ కొరియర్ సంస్థల ద్వారా పార్సిల్ గమ్యస్థానానికి చేరుకోవాలంటే 24 నుంచి 48 గంటల సమయం పడుతుంది. ప్రజారవాణాసంస్థ ఆర్టీసీకి 80 శాతానికి పైగా ప్రాంతాలకు బస్సు సౌకర్యం ఉండడంతో కార్గో సేవలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఈ సౌలభ్యాన్ని ఆసరాగా చేసుకుని ఆర్టీసీ కార్గో ద్వారా గంటల వ్యవధిలోనే పార్శిల్స్ గమ్యస్థానానికి చేరుకుంటున్నాయి. అంతేకాకుండా వినియోగదారుల నమ్మకాన్ని నిలబెడుతూ వారు అందించిన పార్శిళ్లు, కవర్లను సురక్షితంగా చేరవేస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఆర్టీసీ సంస్థ అందిస్తున్న కార్గో సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

అందుబాటు ధరల్లో..

ఆర్టీసీలో పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు ఎక్కువగా ప్రయాణాలు చేస్తుంటారు. వారికి అందుబాటు ధరల్లో కార్గో సేవలను అందజేస్తే పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో అధికారులు తక్కువ ఛార్జీలను తీసుకోవాలని నిర్ణయించారు. ప్రైవేట్ కార్గో సంస్థల కన్నా తమ సేవలను తక్కువ ధరలకు అందిస్తామని విస్తృత ప్రచారం చేశారు. దీనికి అనుగుణంగానే చార్జీలు తీసుకుంటున్నారు.

సురక్షితమైన సేవలు..



ప్రైవేట్ కొరియర్ సర్వీస్‌ల ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చయ్యేవి. మళ్లీ పార్శిల్ సకాలంలో చేరుతుందో లేదోనని ఎదురుచూడాల్సి వచ్చేది. ఆర్టీసీ ఆధ్వర్యంలో లాజిస్టిక్స్ సేవలు చాలా మెరుగ్గా అందజేస్తున్నారు. పార్శిళ్లను కేవలం 24 గంటల్లోనే సురక్షితంగా చేరవేస్తున్నారు. తక్కువ సమయంలో మెరుగైన సేవలు అందిస్తున్నారు.
– రఘు, ఖానాపూర్, ఆదిలాబాద్

సేవలు మరింత విస్తృతం



ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలను ప్రజలు ఆదరిస్తున్నారు. ప్రతి సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. సురక్షితంగా పార్శిల్ కవర్లను గమ్యస్థానాలకు చేరవేస్తుండడంతో ప్రజలు నమ్మకంతో ముందుకు వస్తున్నారు. త్వరలో గ్రామాల్లోనూ హోమ్ డెలివరీ సేవలు ప్రారంభించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ సేవలు సైతం ప్రారంభమైతే లాజిస్టిక్స్ సేవలు మరింత విస్తృతం అవుతాయి.
– బి.శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, లాజిస్టిక్స్, ఆదిలాబాద్ రీజియన్

క్లుప్తంగా

పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తే చర్యలు

నిర్మల్‌టౌన్: ప్రైవేట్ బస్సుల యజమానులు పరిమితికి నుంచి ప్రయాణికులను చేరవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎంవీఐ హరీంద్రకుమార్ హెచ్చరించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని 44 జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సును సీజ్ చేసి డిపోకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



లభ్యమైన మృతదేహం

ముధోల్: మండలంలోని తరోడా గ్రామ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. మృతుని వయస్సు 31 సంవత్సరాలు ఉంటాయని, అతనికి సంబంధించి ఎలాంటి వివరాలు తెలియరాలేదన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కోర్టుకు హాజరైన మాజీ ఎంపీ



హాజరైన రాథోడ్ రమేశ్, నాయకులు

ఖానాపూర్: కడెం మండల కేంద్రంలో గతేడాది రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌తో పాటు 22 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయమై మాజీ ఎంపీతో పాటు ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన నాయకులు బుధవారం ఖానాపూర్ కోర్టుకు హాజరయ్యారు. హాజరైన వారిలో నాయకులు ధర్మాజి కిష్టయ్య, పడాల రాజశేఖర్, నాయిని సంతోష్, తలారి రాజేందర్, పొద్దుటూరి గోపాల్‌రెడ్డి, అమరవేణి రవీందర్‌గౌడ్, దేశాయి రాము, వెంకటస్వామి, లక్ష్మణ్, వెంకన్న, రమేశ్, మోహన్‌నాయక్, భాస్కర్, భీమన్న, శ్రీనివాస్, సంజీవ్, రవి, రవీందర్‌రెడ్డి, మల్లేశ్, రాజేశ్వర్, రాజేశం, పందిరి మోహన్, తదితరులు ఉన్నారు.

ఎంపీ పీఏతో పాటు పలువురిపై అట్రాసిటీ కేసు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్ పీఏ నగేష్‌తో పాటు పలువురిపై మంగళవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మావల ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. మావల మండలంలోని రాంనగర్‌కు చెందిన పట్వాడే రాజుకు బట్టిసావర్‌గాం శివారులో సర్వే నంబర్ 16లో లే ఆవుట్ వేశారు. పనులు కొనసాగుతుండగా ఎంపీ పీఏ సోదరుడు సురేష్ అక్కడికి వెళ్లి బోర్డు ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. రాజుకు ఎంపీ పీఏ సోదరుడు సురేష్‌ల మధ్య వాగ్వివాదం జరిగింది. సురేష్ విషయాన్ని నగేష్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన కొంతమందితో కలిసి అక్కడి వెళ్లారు. మరణాయుధాలతో దాడికి ప్రయత్నించడంతో పాటు కులం పేరుతో దూషించారని రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నకిలీనోటుతో వృద్ధురాలికి టోకరా



అసలు, నకిలీ నోటు చూపుతున్న స్థానికులు

ఖానాపూర్: పట్టణంలోని పాతబస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద కూరగాయలు విక్రయిస్తున్న వృద్ధురాలు కీర్తి పోషవ్వకు గుర్తు తెలియని వ్యక్తి రూ.200ల నకిలీ నోటు ఇచ్చి టోకరా వేసిన ఉదంతం బుధవారం వెలుగుచూసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం కూరగాయల కోసం వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి రూ.200ల నోటు ఇచ్చి రూ.50ల కూరగాయలు కొనుగోలు చేసి మరో రూ.150 తీసుకెళ్లాడని తెలిపింది. తన వద్దకు కూరగాయల కోసం వచ్చిన మరో వ్యక్తికి ఈ నోటును ఇవ్వగా అది డమ్మీ నోటని చెప్పాడు. దీంతో వృద్ధురాలు తనను మోసం చేశాడంటూ లబోదిబోమని మొత్తుకుంది.

పెన్‌గంగ సరిహద్దులో ఇసుక నిల్వల సీజ్



సీజ్ చేసిన జేసీబీని చూపుతున్న ఏడీ

తాంసి(బోథ్): మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దున ప్రవహిస్తున్న పెన్‌గంగ నదిలో అక్రమంగా ఇసుక తవ్వుతున్న అక్రమార్కులపై అధికారులు ఎట్టకేలకూ కొరడా ఝులిపించారు. భీంపూర్ మండలంలోని పెన్‌గంగ సరిహద్దు ప్రాంతం వెంట బుధవారం మైనింగ్ ఏడీ రవిశంకర్, అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. వడూర్ గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను గుర్తించారు. ఇసుక నిల్వలతో పాటు ఇసుక తవ్వుతున్న జేసీబీ వాహనం, రెండు బోల్ట్ యంత్రాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక విలువ రూ.17లక్షలకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడీ వెంట రాయల్టీ ఇన్స్‌పెక్టర్ ఆనంద్, ఆర్ఐ ఉన్నారు.

ఈదులవాడలో వృద్ధుడి హత్య



మల్లయ్య(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: వృద్ధుడిని దారుణంగా హత్య చేసిన ఘటన ఆసిఫాబాద్ మండలంలోని ఈదులవాడలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారశెట్టి మల్లయ్య (75) మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి ఇంటిముందు వాకిట్లో మంచంపై పడుకున్నారు. తెల్లవారుజామున అతని కుమార్తె లూచి వాకిలి ఊడుస్తూ తండ్రిని లేపగా లేవకపోవడంతో కుటుంబ సభ్యులకు చెప్పింది. అందరూ వచ్చి చూడగా అతని మెడ మీద కత్తితో కోసినట్లు ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రమేశ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తన రెండో కుమార్తె అత్తగారి తరపు వ్యక్తి గతంలో చంపుతానని బెదిరించాడని మృతుని భార్య కాంతమ్మ తెలిపింది. అతని మీద అనుమానం ఉందని చెప్పడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రెండు క్వార్టర్లలో చోరీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పేపర్ మిల్లుకు చెందిన రెండు క్వార్టర్లలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని న్యూకాలనీ ఎస్పీఎం పర్మినెంట్ కార్మికుడు మల్లేశ్ ఓఆర్టీ–341లో క్వార్టర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మిల్లులో పనులకు వెళ్లగా, అతని భార్య భాగ్య ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లింది. కుటుంబ సభ్యులు బుధవారం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని 40 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.2వేల నగదును అపహరించినట్లు గుర్తించారు. ఓఆర్టీ–348లో నివాసం ఉంటున్న రవీందర్ రాత్రి విధులకు వెళ్లగా అతని భార్య సరిత తాళం వేసి పుట్టింటికి వెళ్లింది. ఉదయం వచ్చి చూడగా తాళం వేసినట్లే ఉంది. లోనికి వెళ్లి చూడగా వెనుక తలుపు ఒక రెక్కను పూర్తిగా తొలగించి ఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువాలోని తులం బంగారు నగలు, రూ.84వేల నగదును అపహరించారు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్సై అంజయ్య సంఘటన స్థలాలను సందర్శించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని జాతీయ రహదారి 44పై సీతాగోంది సమీపంలోని మేకలగండి వద్ద బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన లారీ డ్రైవర్ సురేష్ (38) మృతి చెందాడు. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళ్తున్న లారీ టైరు పంచర్ కావడంతో డ్రైవర్ సురేష్ టైరును మార్చే పనిలో ఉన్నాడు. ఈ క్రమంలో నిర్మల్ వైపు నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న వెగనార్ కారు సురేష్‌ను ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. రిమ్స్‌కు తరలించి చికిత్స అందించినా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఫిర్యాదు అందాక కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

జైనథ్: మండలంలోని బెల్గాం బ్రిడ్జి వద్ద జైనథ్–బేల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బేల మండలం చప్రాల గ్రామానికి చెందిన అర్జున్, వామన్ బుధవారం బైక్‌పై ఆదిలాబాద్ నుంచి బేలకు వస్తుండగా జైనథ్‌కు చెందిన లాలారాం స్కూటీపై బేల నుంచి జైనథ్‌కు బయలుదేరాడు. బెల్గాం బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరబాద్ తరలించారు.

నవోదయ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

బోథ్: బోథ్ మండలానికి చెందిన విద్యార్థులు నవోదయ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో మండల కేంద్రానికి చెందిన తూము గణపతి, లత దంపతుల కుమారుడు సాయి వైభవ్, రాథోడ్ అనిల్ కుమార్, రంజిత దంపతుల కుమారుడు రాథోడ్ లితేష్ ఉత్తీర్ణత సాధించినట్లు వారు పేర్కొన్నారు.

బీసీలందరికీ రూ.లక్ష సాయం వర్తింపజేయాలి

పాతమంచిర్యాల: బీసీ కులస్తులందరికీ రూ.లక్ష సాయం వర్తింజేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు బుధవారం కలెక్టరేట్‌లో ఏవో సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీలలో 130 కులాలు ఉన్నాయని, కేవలం 15 కులాల వారికే పథకం వర్తింపజేయడం సరికాదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి బీసీలలోని అన్ని కులాల వారికి రూ.లక్ష సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మెరిసిన 'బంగారు' గూడ విద్యార్థినులు



అవార్డు అందుకుంటున్న విద్యార్థినులు

- రాష్ట్రస్థాయి ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో ప్రథమ బహుమతి
- విద్యార్థినులకు రూ.లక్ష నగదు.. ట్యాబ్‌లు ప్రదానం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బంగారుగూడ మోడల్ స్కూల్ విద్యార్థినులు భవాని, పల్లవి, ప్రణవి, రమ్య రాష్ట్ర స్థాయిలో జిల్లా పేరును నిలబెట్టారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఈ నెల 19నుంచి 21వరకు జరిగిన స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించారు. గతంలో రాష్ట్రస్థాయి మూడో బహుమతి సాధించిన ఈ పాఠశాల విద్యార్థినులు ఈసారి అగ్రస్థానంలో నిలిచారు. విత్తనాలు నాటే బూట్లు తయారు చేసి.. వీటికి పైపులు అమర్చి విత్తనాలు భూమిలో పడేలా రూపొందించారు. దీనిని ప్రదర్శించగా రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి దక్కింది. ఇందుకుగాను ప్రభుత్వం రూ.లక్ష నగదు, నలుగురికి ట్యాబ్‌లు, జ్ఞాపికలు అందజేసింది. జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయికి జిల్లా నుంచి ఐదు ప్రదర్శనలు ఎంపికయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 70 ప్రదర్శనలు చేయగా, బంగారుగూడ విద్యార్థినుల ప్రతిభకు అవార్డు దక్కింది. డీఈవో ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ విద్యార్థినులను అభినందించారు.

'వాయిస్ ఫర్ బాయ్స్' సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌సీవో స్వరూపారాణి

జైపూర్: గురుకుల విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడానికి ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వాయిస్ ఫర్ బాయ్స్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ కె.స్వరూపారాణి సూచించారు. మండల కేంద్రంలోని గురుకులంలో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంగనర్ జిల్లాల్లోని 18 గురుకులాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన వాయిస్ ఫర్ బాయ్స్ క్యాంపును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సీవోఈ ప్రిన్సిపాల్ సైదులు, కోటపల్లి ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, స్థానిక వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు బాలభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కన్న పేగును వదులుకోలేక



లక్ష్మణచాంద(నిర్మల్): సృష్టిలో వెలకట్టలేనిది తల్లి ప్రేమ మాత్రమే. జీవి ఏదైనా సరే.. తన పిల్లల కోసం సర్వస్వం త్యాగం చేస్తుంది. మండల కేంద్రంలో ఓ వానరం పిల్ల ఏదో కారణం చేత వారం రోజుల క్రితం మృతి చెందింది. కానీ తన బిడ్డ చనిపోయిందని గుర్తించని తల్లి వానరం చేతిలో పట్టుకుని తిరుగుతోంది. ఇదే మరి తల్లి ప్రేమంటే.



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 5 నిర్మాణాలకు ఇటీవల ప్రపంచ ప్రఖ్యాత 'ఇంటర్నేషనల్ బ్యూటిఫుల్ బిల్డింగ్స్ గ్రీన్ యాపిల్ అవార్డు'లను లండన్‌లో అందుకున్న ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ బుధవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఆ అవార్డులను కేసీఆర్‌కు అందజేశారు.

అనస్తీషియాలజిస్ట్ విభావరి ఘనత

ఏషియన్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ అనస్తీషియా గౌరవ కార్యదర్శిగా ఎన్నిక



బంజారాహిల్స్ (హైదరాబాద్): బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో పని చేస్తున్న అనస్తీషియాలజిస్ట్, ఇంటెన్సివ్ వైద్య నిపుణురాలు డాక్టర్ విభావరి నాయక్ ఏషియన్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ అనస్తీషియాకు గౌరవ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మొదటిసారి భారతీయ వైద్యురాలు ఈ పదవికి ఎన్నికయ్యారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగిన మూడు రోజుల కాన్ఫరెన్స్‌లో ఆమెను ఈ పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్ల పాటు ఆమె ఈ పదవికి ప్రాతినిధ్యం వహిస్తారు. 2010 నుంచి బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో ఆమె పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే ప్రతి ఒక్కరితో పనిచేసే గొప్ప అవకాశాన్ని పొందానని ఆనందం వ్యక్తం చేశారు.

పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వాణిజ్య పన్నుల గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ (టీసీటీజీవోఏ) రాష్ట్ర అధ్యక్షునిగా వి.శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. ఇటీవల అసోసియేషన్ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా మురళీమోహన్, సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.దేవేందర్, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీగా ఎస్.భాస్కర్, స్పోర్ట్స్ సెక్రటరీగా పి.రామలక్ష్మయ్య, కోశాధికారిగా ఎస్.గిరిధర్, జాయింట్ సెక్రటరీలుగా బి.రాజు, డి.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా కందిమళ్ల సుధీర్‌రెడ్డి, బీమ్లా, నరేశ్‌రెడ్డి, విజయ్, మురళి ఎన్నికయ్యారు. వీరు మూడేళ్లపాటు పదవుల్లో కొనసాగనున్నారు.

హస్తినలో బంగారు బోనం

ఘనంగా లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి బోనాలు ● బంగారు బోనాలు సమర్పించిన బండారు దత్తాత్రేయ, బీఆర్‌ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలు రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. హైదరాబాద్ పాతబస్తీ లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బుధవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ బంగారు బోనం సమర్పించారు. అలాగే బీఆర్‌ఎస్ ఎంపీలు సురేశ్‌రెడ్డి, వెంకటేశ్ నేత, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథం, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌లు రాష్ట్ర ప్రభుత్వం తరఫున బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీ వెంకటేశ్ నేత మీడియాతో మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ, పట్టణ, వ్యవసాయం, ఐటీ.. ఇలా అన్ని రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వకపోయినా చెరువుల పునరుద్ధరణ చేశారని, ప్రాజెక్టులను నిర్మించారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఆదరించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సంకల్పంతో తెలంగాణ అభివృద్ధి జరుగుతోందని, తెలంగాణ పాలనపై పక్క రాష్ట్రాల్లో చర్చ జరుగుతోందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మరో ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాలు జరుపుకోవడం సంతోషకరమన్నారు.



బంగారు బోనం తీసుకెళ్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

బీఆర్‌ఎస్ ఎంపీలను అడ్డుకున్న శేజల్


ఇదిలా ఉండగా బోనాల కార్యక్రమంలో పాల్గొనడానికి తెలంగాణ భవన్‌కు వచ్చిన బీఆర్‌ఎస్ ఎంపీలు వెంకటేశ్ నేత, సురేశ్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డిలకు నిరసన సెగ తగిలింది. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ భవన్ వేదికగా గత కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న శేజల్, ఎంపీలను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఎంపీల వాహనానికి అడ్డుగా నిలిచి శేజల్, ఆరిజన్ డైరీ నిర్వాహకుడు ఆదినారాయణ నిరసన వ్యక్తం చేయగా.. ఎంపీ సురేశ్‌రెడ్డి కారు దిగివచ్చి, సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.



బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైకోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆసనాలు వేస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, ఏజీ బీఎస్ ప్రసాద్, హైకోర్టు న్యాయమూర్తులు

ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బారావుకు 'బూటి' అవార్డు

సాక్షి, హైదరాబాద్: శాస్త్ర సంబంధిత సమాచారాన్ని సామాన్యుల చెంతకు చేర్చేందుకు విశేష కృషి చేస్తున్న జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) శాస్త్రవేత్త, న్యూట్రిషన్ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ విభాగ అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారావు ఎం. గవరవరపు.. ప్రతిష్ఠాత్మక బూటి ఫౌండేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్లాస్మా ఫిజిక్స్ శాస్త్రవేత్త డాక్టర్ బిమలా బూటి ఏర్పాటు చేసిన బూటి ఫౌండేషన్ అవార్డును గుజరాత్ సైన్స్ అకాడమీ అందజేస్తోంది. సైన్స్ అండ్ టెక్నాలజీతోపాటు భవిష్యత్తుపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేసిన వారిని ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు.



గోవా రాజ్‌భవన్‌లో యోగా దినోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు చేయండి

మళ్లీ నిర్వహణకు హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 11న తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష సందర్భంగా అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోకపోవడం అక్రమాలకు తావిచ్చేలా ఉందని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించేలా ప్రభుత్వాన్ని, టీఎస్‌పీఎస్సీని ఆదేశించాలని కోరుతూ గ్రూప్–1 అభ్యర్థులు బి.ప్రశాంత్, బండి ప్రశాంత్, జి.హరికృష్ణ పిటిషన్ వేశారు. టీఎస్‌పీఎస్సీని ప్రతివాదిగా పేర్కొన్నారు. హాల్ టికెట్ నంబర్, ఫొటో లేకుండానే ఓఎంఆర్ షీట్లు ఇచ్చారని.. ఇది అక్రమాలకు పాల్పడేందుకు అవకాశం ఇచ్చేలా ఉందని స్పష్టం చేశారు. ఒకసారి లీకై మళ్లీ నిర్వహిస్తున్న గ్రూప్–1 విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవలసిన కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 13న టీఎస్‌పీఎస్సీకి వినతి పత్రం కూడా ఇచ్చినా స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. న్యాయవాది బి.నర్సింగ్ ఫైల్ చేసిన ఈ పిటిషన్‌పై గురువారం జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

తెలంగాణ సాహిత్యాన్ని కాపాడుకోవాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఘనంగా ప్రారంభమైన సాహితీ సభలు
- ఆచార్య ఎన్.గోపికి జయశంకర్ పురస్కారం ప్రదానం

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): తెలంగాణ సాహిత్య వికాసాన్ని, సాహితీ పుత్రులను నిరంతరం స్మరించుకోవడంతో పాటు తెలుగు సాహిత్యాన్ని మరింత పరిపుష్టం చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అధ్యక్షతన తెలంగాణ సాహిత్య సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆచార్య ఎన్.గోపికి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ తొలి విశిష్ట సాహితీ పురస్కారం –2023ను కవిత ప్రదానం చేసి ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాధించుకోవడం ఎంత ముఖ్యమో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమన్న నినాదంతో ఉద్యమం చేశామన్నారు. తెలుగు సాహిత్యాన్ని తెలంగాణ వారు మరింత పరిపుష్టం చేయాలన్న ఉద్దేశంతో భారత జాగృతి ఆధ్వర్యంలో సాహితీ సభలను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఇకపై ఏటా తెలంగాణ సాహిత్య సభలు జరుపుతామని ప్రకటించారు. రెండురోజుల పాటు జరగనున్న సాహిత్య సభల్లో పలు అంశాలపై చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ చర్చలన్నింటిని గ్రంథస్తం చేస్తామని చెప్పారు. కాగా, సాహితీ ప్రేమికులుగా హిందీభాషలో ఉన్న సాహిత్యాన్ని ఆరాధిస్తామని, కానీ ఇదే మాట్లాడాలని రూల్స్ పెడితే మాత్రం తప్పకుండా రూల్స్ బ్రేక్ చేస్తామని పేర్కొన్నారు. దేశంలో తెలంగాణ మినహా ఏ రాష్ట్రంలో కూడా వేతనాలు చెల్లిస్తూ కళాకారులను గౌరవించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.గోపికి విశిష్ట సాహిత్య పురస్కారం కింద స్వర్ణ కంకణంతో పాటు రూ.1,01,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిని సిద్దారెడ్డి, డాక్టర్ గోరటి వెంకన్న, డాక్టర్ తిరునగరి దేవకీ దేవి, డాక్టర్ గోగు శ్యామల, డాక్టర్ నాళేశ్వరం శంకర్, జాగృతి కార్యకర్తలతో పాటు పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.



ఆచార్య ఎన్.గోపికి స్వర్ణకంకణం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత తదితరులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న దివ్యాంగులు

కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్
- కన్హా శాంతివనంలో దివ్యాంగుల సామూహిక యోగా
- మూడు రికార్డులు సొంతం

నందిగామ: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 16 రాష్ట్రాలకు చెందిన 3వేల మంది దివ్యాంగులు సామూహిక యోగా చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వీరేంద్ర కుమార్ యోగాసనాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ప్రతీ ఒక్కరు దినచర్యలో భాగంగా యోగా చేయాలన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులు సామూహికంగా భారీ ఎత్తున పాల్గొని యోగా చేసినందుకుగాను అంతర్జాతీయ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకున్నారు. అనంతరం దృష్టి, వినికిడి, అంగవైకల్యం కలిగిన సుమారు 200 మందికి సహాయ ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఐఈపీఐడీ డైరెక్టర్ రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారి నిర్లక్ష్యం.. బైక్ చోరీ !

- రైల్వే పార్సిల్‌లో బుక్ చేస్తే మాయం
- బుకింగ్ అధికారి తీరుపై ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా రూ.2లక్షల విలువైన మోటార్‌సైకిల్ చోరీకి గురైంది. మంచిర్యాలకు చెందిన మంతెన సంతోష్ గత జనవరిలో మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి బెంగళూరులోని తన తమ్ముడికి మోటార్‌సైకిల్ పంపేందుకు బుక్ చేశాడు. రోజులు గడిచినా అటు బెంగళూరుకు గానీ ఇటు మంచిర్యాలకు గానీ చేరలేదు. దీంతో స్థానిక రైల్వే అధికారులను అడిగితే సరైన సమాధానం రాలేదు. ఆ తర్వాత మోటార్‌సైకిల్ విషయమై ఆరా తీయగా, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఎవరో దొంగిలించారని ఆర్పీఎఫ్ పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో తన బైక్ ఇప్పించాలని గత ఫిబ్రవరిలో రైల్వే ఉన్నతాధికారులకు సంతోష్ ఫిర్యాదు చేశాడు. ఇప్పటికీ తన బైక్ అప్పగించకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వ రంగ సంస్థ అని నమ్మకంతో కొనుగోలు చేసి ఏడాది కూడా కాని రూ.2లక్షల మోటార్‌సైకిల్‌ను రైలు పార్సిల్‌లో బుక్ చేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆవేదన చెందుతున్నాడు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బైక్ ఇప్పించాలని కోరుతున్నాడు.



చోరీకి గురైన బైక్

ఓ అధికారి తీరుపై ఆరోపణలు

మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో పని చేస్తున్న ఓ అధికారి బుకింగ్ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. మోటార్‌సైకిల్ పార్సిల్‌లో బుక్ చేసేటప్పుడు ట్యాంక్‌లో పెట్రోల్ తీసివేయడం, తాళం యాజమాని వద్దే ఉంచడం చేస్తారు. అవేవీ చేయకుండానే బుక్ చేయడంతో దొంగ నేరుగా స్టేషన్ నుంచి తాళం తీసుకుని, పెట్రోల్ ఉండడంతో పాత హైదరాబాద్‌లోని బస్తీ వరకు వెళ్లినట్లు ఆర్పీఎఫ్ అధికారులు విచారణలో గుర్తించారు. ఆ తర్వాత బైక్ ఆచూకీ దొరకకపోవడంతో అసలు బైక్ దొరుకుతుందా? లేదా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఐదు నెలలు గడుస్తున్నా బాధిత యువకుడికి న్యాయం ఎలా చేస్తారో తేలాల్సి ఉంది. గతంలోనూ స్టేషన్‌లో పని చేస్తున్న ఓ బుకింగ్ అధికారి తీరుపై ఫిర్యాదులు ఉన్నాయి. ప్రయాణికులకు బుకింగ్ సమయంలో సరైన సేవలు అందించడం లేదని శ్రీరాంపూర్‌కు చెందిన ఓ సింగరేణి ఉద్యోగి ఫిర్యాదు చేశాడు. రైలులో వారణాసి వెళ్లేందుకు టికెట్లు బుకింగ్ చేయాలని చెబితే సరిగా స్పందించడం లేదని ఫిర్యాదు చేశారు. అంతేకాక ఆ అధికారి తోటి సిబ్బంది పట్ల ప్రవర్తన తీరు సరిగా లేకపోవడంతో ఇటీవల రామగుండంకు బదిలీ చేశారు. కానీ అధికారులు ఇబ్బంది పెడితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి ఇక్కడే కొనసాగుతున్నట్లు తెలిసింది. ఆ అధికారి బెదిరింపులపై ఇటీవల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు కూడా నమోదైంది. రైల్వే ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. బుధవారం ఆయన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు హామీలను మరిచి .. ఇచ్చిన హామీలు గుర్తుచేస్తూ దశాబ్ది ఉత్సవాలపేరుతో దగా చేస్తోందని ఫైర్ అయ్యారు. దీనిపై ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు పదింటిని ప్రజలకు వివరించి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తామన్నారు. కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఉంటుందన్నారు. ఇటీవల మంత్రి గంగుల కమలాకర్ తాను ఔట్ డేటెడ్ నాయకుడని విమర్శలు చేశారని, నేను మచ్చలేని నాయకుడినని, పార్టీ మారింది మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంత్రి గంగుల దిగజారుడు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో ఇటీవల మంత్రి గంగుల కమలాకర్ వివిధ కార్యక్రమాల్లో కలుసుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తనపై ఎలాంటి ఆరోపణలు లేవని.. నిప్పులాంటి వ్యక్తనని స్పష్టం చేశారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, నాయకులు గూ డూరు స్వామిరెడ్డి, గూడెం సారంగపాణి, మేకల తిరుపతి, తిప్పారపు సంపత్, కొలిపాక శంకర్, రమే శ్, మిడిదొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలను విద్యాలయ సమితి బుధవారం సాయంత్రం విడుదల చేసినట్లు కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ చక్రపాణి ఒక ప్రకటనలో వెల్లడించారు. కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో 80 సీట్లు అందుబాటులో ఉండగా, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం జిల్లాల నుంచి మొత్తం 5,920 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఏప్రిల్ 30న ప్రవేశపరీక్ష నిర్వహించారు. ప్రతిభ, రిజర్వేషన్ల ప్రతిపాదికన విద్యాలయ సమితి(న్యూఢిల్లీ) విద్యార్థులను ఎంపిక చేసి వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచింది. విద్యార్థి హాల్ టిక్కెట్ నంబర్, పుట్టిన తేదీ ఆధారంగా ఫలితాలు తెలుసుకోవచ్చని ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు, హాల్‌టిక్కెట్ నంబర్లతో వివరాలను గురువారం ప్రకటిస్తామని ఆయన వివరించారు.

గుర్తింపు ఎన్నికలపై నీలినీడలు

- హైకోర్టులో సింగరేణి పిటీషన్
- మరో పిటిషన్‌కు టీబీజీకేఎస్ సన్నద్ధం
- ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ల విముఖత ?

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఫిబ్రవరి 2023న హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో డెప్యూటీ సీఎల్సీ ఎన్నికల నిర్వహణకు సమావేశాలు ఏర్పాటు చేస్తోంది. ఈ తరుణంలో సింగరేణి కంపెనీ తాజాగా హైకోర్టులో బుధవారం మరో పిటీషన్‌ను దాఖలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితిపై స్పష్టత కోరుతూ, నాలుగేళ్లు ఉండాలని పిటీషన్‌లో కోరినట్లు తెలిసింది. మరో ఆరు నెలల్లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ఉన్నాయని, నిర్వహణ కోసం ముందస్తు ఏర్పాట్లు చేయాల్సి ఉండగా ఇప్పుడున్న పరిస్థితుల్లో తాము సింగరేణి ఎన్నికలకు సిబ్బందిని కేటాయించడం వీలు కాదంటూ కొద్ది రోజుల క్రితం కోల్‌బెల్ట్ జిల్లాల కలెక్టర్లు కొందరు కంపెనీకి లేఖలు రాశారు. దీన్ని కూడా కంపెనీ తన పిటీషన్‌లో సూచించిందని తెలిసింది. ఇప్పటికే ఏఐటీయూసీ నేతలు గతంలో వేసిన పిటీషన్‌పై కోర్టు కేవియట్ ఇచ్చి ఉన్నా నేపథ్యంలో కంపెనీ వేసిన పిటీషన్‌పై ఎన్నికలు జరుగకుండా కోర్టు స్టే ఇవ్వదనే వాదన ఉంది.

24న ఎన్నికల షెడ్యూల్ వచ్చేనా..

ఈ నెల 24న డెప్యూటీ సీఎల్సీ వద్ద గుర్తింపు సంఘం ఎన్నికలపై సమావేశం ఉంది. ఈ సమావేశంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని డెప్యూటీ సీఎల్సీ గత సమావేశంలో పేర్కొన్నారని కార్మిక సంఘం నాయకులు తెలిపారు. తాజాగా కోర్టులో కంపెనీ పిటీషన్‌తో 24న జరిగే సమావేశంలో షెడ్యూల్ వస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నాలుగేళ్ల కోసం టీబీజీకేఎస్ కోర్టుకు..

గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితిపై పేచీ కొనసాగుతోంది. రెండేళ్ల, నాలుగేళ్ల అనే దానిపై డెప్యూటీ సీఎల్సీ స్పష్టతనివ్వడం లేదు. సీఎల్సీ ఆదేశాల అనుగుణంగా కాలపరిమితి ఉంటుందని ఇటీవల జరిగిన సమావేశంలో డెప్యూటీ సీఎల్సీ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌లో దీనిపై స్పష్టత ఇవ్వాలని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నేతలు కూడా హైకోర్టులో కేసు వేయడానికి సిద్ధమయ్యారని తెలిసింది.

ఇంకా జాప్యం చేస్తే ఊరుకోం..

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జాప్యం చేస్తే ఇంకా ఊరుకునేది లేదు. ప్రభుత్వానికి ఎన్నికలు నిర్వహించాలని లేదు. ఎన్నికలు నిర్వహిస్తే ఓడిపోతామనే భయంతో ఏదో సాకుతో అడ్డుతగులుతుంది. అధికార సంఘానికి గడ్డు పరిస్థితులు ఉన్నాయనే భయంతో ఎన్నికలకు వెళ్లడానికి భయపడి జరుగకుండా కుట్రలు చేస్తున్నారు. దీనిపై తాము అవసరమైతే మళ్లీ కోర్టుకు, సీఎల్సీ వద్దకు వెళ్తాం.

– ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి వీ.సీతారామయ్య

నిద్దరోతున్న నిఘా విభాగం

- విజిలెన్స్‌కు పట్టుబడే వరకూ తెలియని వైనం
- సింగరేణిలో మాయమవుతున్న సామగ్రి
- ప్రయివేటీకరణతో పెరుగుతున్న చోరీలు

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో అహర్నిశలు శ్రమించాల్సిన సెక్యూరిటీ విభాగం నిద్దరోతోంది. కార్మికులపై పెడుతున్న నిఘా ఇతర వాహనాలపై ఉండటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో చోరీల సంఖ్య పెరిగిపోతోందని అంటున్నారు. గతంలో సిమెంట్ బ్యాగ్‌ల చోరీ, పాతపైపుల తరలింపు, బొగ్గు లోడింగ్‌లో అవకతవకలు, స్క్రాప్, కాపర్ మాయం వంటి సంఘటనలు జరిగినా.. సెక్యూరిటీ పెద్దగా పట్టించుకోవడం లేదని అంటున్నారు. సంస్థ ఆస్తుల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన సెక్యూరిటీ విభాగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సెక్యూరిటీ అధికారులు నాలుగు రోజుల కిందట ప్రత్యేకంగా సమావేశమై సింగరేణి ఆస్తుల పరిరక్షణపై పలు సూచనలు, సలహాలు చేసినప్పటికీ చోరీల సంఖ్య మాత్రం ఆగడం లేదు. సంస్థలో ప్రయివేటీకరణ వేగవంతంగా పెరిగిపోవడంతో లొసుగులు కూడా అదేస్థాయిలో ఉంటున్నాయి. ప్రయివేట్ వాహనాల్లో సంస్థ సొమ్ము తరలించి పట్టుబడిన సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. సింగరేణిలో 50శాతానికి పైగా ప్రైవేటు సెక్యూరిటీ రావడంతో సంస్థ ఆస్తుల భద్రతపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం కావాలనే పర్మినెంట్ సెక్యూరిటీని తగ్గిస్తూ.. ప్రయివేట్ సెక్యూరిటీని పెంచుతోందనే ప్రచారం సాగుతోంది. ఇటీవల సింగరేణి బొగ్గు వేయింగ్‌లో కూడా అవకతవకలు జోరుగా సాగుతున్నాయి. లారీలో బొగ్గు నింపి వేయింగ్ జరిగిన తర్వాత మళ్లీ కొంతమేర బొగ్గు నింపి తరలిస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఓసీపీల్లో విలువైన కాపర్ కేబుల్ చోరీలు పెరిగిపోతున్నాయి. తాజాగా ఓ గని నుంచి ఏసీ మూడు ఏరియాలు దాటి ఎస్టీపీపీ ప్రాంగణంలోకి చేరి వాహనం తిరిగి వస్తున్న క్రమంలో విజిలెన్స్‌కు చిక్కడం చర్చనీయాంశంగా మారింది. విజిలెన్స్ విభాగానికి చిక్కేవరకూ ఇక్కడ సమాచారం లేకపోవడం సెక్యూరిటీ విభాగం తీరుపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బొగ్గు గని కార్మికులు

ప్రయివేట్ వాహనాల హవా..

సింగరేణిలో ప్రయివేట్ వాహనాల హవా సాగుతోంది. నిత్యం ఉద్యోగులను క్వారీలోకి తీసుకెళ్లడం, తిరిగి తీసుకురావడం జరుగుతోంది. కొంత మంది దీన్ని సాకుగా తీసుకుని ప్రయివేట్ వాహనాలను దుర్వినియోగం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏసీ తరలింపులో కూడా ప్రయివేట్ వాహనం, ప్రయివేట్ టెక్నీషియన్‌ను వినియోగించడం విశేషం. దీనివల్ల ఎలాంటి చర్యలూ ఉండవని అంటున్నారు. కొంతమంది సంస్థ సామగ్రి తరలించడంలో భయం లేకుండా ముందుకు సాగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సెక్యూరిటీ తీరుపై విమర్శలు

సెక్యూరిటీ తీరుపై సంస్థలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం విధులు నిర్వర్తించే అధికారులకు ఒకలా.. కార్మికులకు మరోలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కార్మికుల వాహనాలపై దృష్టి సారిస్తున్న విధంగా అధికారుల వాహనాలను పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. దీంతో కొంత మంది చేస్తున్న పనులకు అడ్డులేకుండా పోతోందని అంటున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 158/A, Nadipalli Village, Dichpalli Mandal, Nizamabad Dist - 503 175, TG, Printed at Jagati Publications Limited Survey No 158/A, Nadipalli Village, Dichpalli Mandal, Nizamabad Dist - 503 175, TG, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) 08461 - 222645, 222646, 222647, Fax: 08461 - 222649. RNI Regn No. TELTEL/2008/23795.